సాక్షి నిజామాబాద్

మంగళవారం। 20। మే। 2025



ప్రజావాణికి..
ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు.
- 8లో ▸



పచ్చిరొట్ట.. పంట దిట్ట
పచ్చిరొట్టలో సేంద్రియ పదార్థం ఉంటుంది. సూక్ష్మజీవులు విస్తారంగా వృద్ధి చెంది భూసారం పెరుగుతుంది.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.8 /25.1

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రైవేట్ స్కూళ్ల సమస్యలు పరిష్కరించండి



నిజామాబాద్‌అర్బన్: ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని ట్రస్మా నాయకులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి జయసింహగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రైవేట్ స్కూల్ ఫీ రెగ్యులేటర్ కమిటీ పొందుపర్చిన అంశాల్లో ఇబ్బందులను తొలగించాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు రాస నిత్యానందం, జిల్లా సెక్రెటరీ గోజూరి అరుణ్, రాష్ట్ర అడ్వైజర్ మామిడాల మోహన్, అర్బన్ ప్రెసిడెంట్ ధర్మరాజు, సెక్రెటరీ శ్రీనివాస్, నర్సాగౌడ్, పృథ్వి, మైనారిటీ ప్రెసిడెంట్ ఇక్బాల్ ఖాన్, మహమ్మద్ కైఫ్, ముజాహిద్ రహమాన్, జాకీర్ హుస్సేన్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కోసం ఆసక్తి ఉన్న ప్రైవేట్ పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తులను ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు..

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఇంటర్ విద్య కోసం కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి నిర్మల ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో చదివి, పదో తరగతిలో 7.0 జీపీఏ, ఆపై జీపీఏ సాధించినవారు అర్హులని తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్'

ఖలీల్‌వాడి: ప్రయాణికుల సమస్యలను తెలుసుకోవడంతోపాటు వారి సలహాలు, సూచనలను స్వీకరించేందుకు నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో 'డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్ఎం జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్ కొనసాగుతుందని, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కింది నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

రీజినల్ మేనేజర్	99592 26011
ఆర్మూర్ డిపో	99592 26019
బోధన్ డిపో	99592 26001
నిజామాబాద్ డిపో1	99592 26016
నిజామాబాద్ డిపో 2	99592 26017
కామారెడ్డి డిపో	99592 26018
బాన్సువాడ డిపో	99592 26020

డిగ్రీ పరీక్షల్లో 508 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం మూడో రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన మొత్తం 32 పరీక్ష కేంద్రాల్లో 7,680 మంది విద్యార్థులకు 7,172 మంది హాజరు కాగా 508 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7,112 మంది విద్యార్థులకు 6,670 మంది హాజరు కాగా 442 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 568 మంది విద్యార్థులకు 502 మంది హాజరుకాగా 66 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సేంద్రియ సాగుపై శిక్షణ

డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో గ్రామీణ యువ రైతులకు సేంద్రియ వ్యవసాయంపై నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ భరత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి జూన్ 1వరకు శిక్షణ ఇస్తామని.. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన యువ రైతులు ఈ నెల 23వ తేదీలోగా కలెక్టరేట్‌లోని ఆత్మ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందులో 15 మందిని ఎంపిక చేసిన శిక్షణ ఇస్తామని, వివరాలకు 94406 87698ను సంప్రదించాలన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్, పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్, ర్యాలీ కన్వీనర్ కృపాకర్‌రెడ్డి తదితరులు



మనం సైతం దేశం కోసం..

భారత సైన్యానికి మద్దతుగా 'మనం సైతం దేశం కోసం' అంటూ నగరవాసులు సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత సాయుధదళాలకు గౌరవ సూచకంగా నిర్వహించిన ర్యాలీకి భారీ సంఖ్యలో యువత తరలివచ్చారు. సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ కన్వీనర్ జీవీ కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజరాజేంద్ర చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. దేశభక్తి నినాదాలు మారుమోగాయి. సర్వీస్‌మెన్లు, సైనికులు ర్యాలీలో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. – సుభాష్‌నగర్



ర్యాలీలో దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న యువకులు

కనిపించని కచ్చితత్వం

- తూనికలు, కొలతలపై అవగాహన నామమాత్రమే
- ఆ శాఖ మనుగడలో ఉందా? లేదా? అని సందేహాలు
- కనీసం ఉనికి చాటని వైనం
- బంగారం బిల్లులపై కనిపించని హెచ్‌యూఐడీ నంబర్
- నేడు అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ దినోత్సవం



వ్యాపారి నుంచి వస్తువు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారుడికి ఆ వస్తువుకు సంబంధించిన కొలతల కచ్చితత్వం, దాని నాణ్యతలో విశ్వసనీయత ఎక్కడా కనిపించడం లేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తూనికలు, కొలతల 2011 లీగల్ మెట్రాలజీ నిబంధనల అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. అసలు తూనికలు, కొలతల శాఖ మనుగడలో ఉందా? అనే పరిస్థితి ఉంది. నేడు అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తూనికలు, కొలతల శాఖ విధులకు సంబంధించి ప్రభుత్వాలు అవగాహన కల్పించే విషయంలో ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. వ్యాపారులు యథేచ్ఛగా మోసం చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తూనికలు, కొలతల శాఖ 2011 లీగల్ మెట్రాలజీ రూల్స్ అమలు చేసే విషయంలో పూర్తి నిర్లక్ష్యం నెలకొంది. అసలు ఈ శాఖ పనిచేస్తున్న సంగతే ఎవరికీ తెలియని పరిస్థితి. పట్టణ ప్రాంతాల్లోని వినియోగదారులకే లీగల్ మెట్రాలజీ శాఖ గురించి ఏమాత్రం అవగాహన లేదు. ఇక ఉమ్మడి జిల్లా లో గ్రామీణ వినియోగదారుల శాతం అత్యధికంగా 67శాతం ఉంది.

తూనికలు, కొలతలకే పరిమితం కాదు..

లీగల్ మెట్రాలజీ శాఖ కూరగాయల మార్కెట్లు, చేపల మార్కెట్లలో తూనికలు కొలతలలకే పరిమితం కాదనే విషయాన్ని వినియోగదారులు తెలుసుకోవాలి. ఇదిలా ఉండగా సంబంధిత అధికారులు సైతం పెట్రోల్, డీజిల్ విషయంలోనూ క్వాంటిటీపై ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జ్వరం వచ్చినప్పుడు చూసే థర్మామీటర్, గ్యాస్ మీటర్లు, ఇంటర్‌నెట్ స్పీడ్ లెక్కించడం, ఆటో మీటర్లు, ట్యాక్సీ మీటర్లు, తూకం రాళ్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, వే బ్రిడ్జీలు, హోటళ్లలో ఇష్టం వచ్చిన ధరలకు నీళ్ల బాటిళ్లు తదితర వాటిని లీగల్ మెట్రాలజీ అధికారులు పర్యవేక్షించాలి. కానీ ఆ దిశగా అధికారులు పని చేయకపోవడంతో ఎవరూ నిబంధనలు పాటించడంలేదు. 'లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్డ్ కమోడిటీస్ రూల్స్ 2011' మేరకు గ్యాస్ మీటర్లు, ఇంటర్నెట్ స్పీడ్‌ను తెలుసుకొనే పరికరాలు, ఆహార పదార్థాలలో కొవ్వు శాతం తెలుసుకొనే పరికరాలు, శ్వాస వేగం తెలుసుకొనే బ్రీత్ అనలైజర్స్, టాక్సీ మీటర్లు, రైల్వే వే బ్రిడ్జీలు, సీటిలో చల్లదనం, వేడి శాతం తెలుసు కొనే వాటర్ మీటర్లు తదితర కొలతల్లో వినియోగదారులు మోసపోకుండా ఉండటానికి గాను లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011లో సవరణలు జరిగాయి.

రెడీమిక్స్‌కూ లీగల్ మెట్రాలజీ నిబంధనలు..

భవన నిర్మాణాలకు సంబంధించి బిల్డర్లు అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో లీగల్ మెట్రాలజీ నిబంధనలు పాటించాల్సి ఉంది. సిమెంట్, ఇసుక, కంకర మిక్స్ విషయంలో పాటించాల్సిన ప్రమాణాల విషయంలో తూనికలు, కొలతల విభాగం అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయాలపై వినియోగదారులకు సైతం ఏమాత్రం అవగాహన లేదు.



సినిమా థియేటర్లలో..

నిజామాబాద్ నగరంలోని మల్టీప్లెక్స్‌లు, థియేటర్‌లలో ఇష్టారీతిన ధరలు వసూలు చేస్తున్నారు. తినే పదార్థాల ప్యాక్‌లపై ఇష్టం వచ్చినట్లు ఎమ్మార్పీలు ముద్రించి విక్రయిస్తున్నారు. నీళ్ల బాటిళ్లు, శీతల పానీయాలు, తినుబండారాల విషయంలో భారీ దోపిడీ సాగుతోంది. బయటితో పోలిస్తే అనేక రెట్ల ధరలు వసూలు చేస్తున్నారు. ఇక తినుబండారాల నాణ్యత మరీ తీసికట్టే.

హెచ్‌యూఐడీ నంబరు అనే మాటే లేదు..



బంగారు, వెండి ఆభరణాల వ్యాపారంలో లీగల్ మెట్రాలజీ శాఖ కేవలం ఎలక్ట్రానిక్ కాంటాలు, తూకంల తనిఖీకే పరిమితమవుతోంది. వినియోగదారులు బంగారు, వెండి ఆభరణాల నాణ్యత విషయంలో మోసపోతున్నారు. లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011 రూల్ 9 (4) ప్రకారం వ్యాపారులు బంగారు, వెండి ఆభరణాల నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా రసీదులపై రాయాలి. అలాగే రూల్ 9 (5) ప్రకారం బంగారు, వెండి ఆభరణాల నాణ్యతా ప్రమాణాల పరీక్షలు నిర్వహించే అధికారం లీగల్ మెట్రాలజీ అధికారులకు ఉంది. అయితే ఉమ్మడి జిల్లాలో అధికారులు నాణ్యతా పరీక్షలు నిర్వహించడం లేదు. దీంతో బంగారం విక్రయించే చిన్న, పెద్ద వ్యాపారులెవరూ బిల్లులపై హెచ్‌యూఐడీ (హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్) నంబరును వేయకుండానే విక్రయాలు సాగిస్తుండడం గమనార్హం.

కమిషన్‌ను ఆశ్రయించాలి



బంగారం విషయంలో హెచ్‌యూఐడీ నంబర్లు ఇవ్వకపోయినా, నిబంధనలు పాటించకపోయినా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌కు ఫిర్యాదు చేయాలి. అదేవిధంగా లీగల్ మెట్రాలజీ అధికారులను సంప్రదించాలి. అయినప్పటికీ పట్టించుకోకపోతే వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించాలి. పెట్రోల్, డీజిల్ క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో తేడాలుంటే పొరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ అధికారులు పట్టించుకోకపోతే వినియోగదారుల కమిషన్‌కు వెళ్లాలి. అందరూ తూనికలు, కొలతలపై అవగాహన కలిగి ఉండాలి. – సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి

తీగ లాగితే డొంక కదులుతోంది

- సిరికొండ పీహెచ్‌సీలో అక్రమాలెన్నో..
- ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న వైనం

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: 'విధులకు డుమ్మా.. రిజిస్టర్‌లో సంతకాలు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం వైద్యారోగ్యశాఖలో సంచలనం రేపిన విషయం తెలిసిందే. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సీరియస్ కావడంతో జిల్లా వైద్యాధికారులతోపాటు రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శశిశ్రీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన సిరికొండ పీహెచ్‌సీలో విచారణ చేపట్టి నివేదికతో వెళ్లారు. 'సాక్షి' కథనం ద్వారా తీగ లాగితే డొంక కదులుతోంది. ఒక్కొక్కటిగా అక్రమాలు బయటకు వస్తూనే ఉన్నాయి.

మౌనంపై అనుమానాలు

పీహెచ్‌సీని తనిఖీ చేసేందుకు నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ రెండు నెలల్లో నాలుగుసార్లు వెళ్లారు. తనిఖీలకు వెళ్లిన సమయంలో ఎవరెవరు లీవ్‌లో ఉన్నారు, హాజరు, గైర్హాజరు, ఈఎల్, సీఎల్ తదితర వాటిని రికార్డుల్లో పరిశీలించి సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఓ అధికారి ఆరు నెలలపాటు సిక్ లీవ్‌లో ఉంటే జిల్లా వైద్యాధికారి అనుమతి ఉండాలి, ఒకవేళ అనుమతి ఉన్నా తిరిగి విధుల్లో చేరేందుకు సైతం ఉన్నతాధికారి అనుమతించాల్సి ఉంటుంది. అయితే పలుమార్లు తనిఖీలకు వెళ్లిన డిప్యూటీ డీఎంహెచ్‌వో అటెండెన్స్ రిజిస్టర్‌ను ఎందుకు పరిశీలించలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఇష్టారాజ్యం

సిరికొండ పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. కొందరు అసలే విధులకు హాజరుకాకపోగా, మరికొంత మంది ఇలా వచ్చి అలా వె ళ్తుండగా, ఇంకొంత మంది రాకున్నా అటెండెన్స్ రిజిస్టర్‌లో దర్జాగా సంతకాలు చేస్తున్నారు. పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్‌సీ మార్చి, ఏప్రిల్ నెలల్లో సక్రమంగా విధులకు హాజరుకాకున్నా రిజిస్టర్‌లో సంతకాలు చేసి జీతం పొందినట్లు తెలిసింది. సెక్షన్‌లో పైఅధికారికి ప్రతి నెలా సుమారు రూ.20వేల వరకు కమీషన్ ఇవ్వడంతోనే దర్జాగా జీతాలు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు సిక్ లీవ్‌లో ఉన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆ తరువాత జిల్లా ఉన్నతాధికారికి తెలియకుండానే విధుల్లోకి చేరినట్లు తెలిసింది.

సిక్‌లో ఉన్నాడని చెప్పారు

నేను తనిఖీలకు వెళ్లిన సమయంలో సదరు ఉద్యోగి సిక్ లీవ్‌లో ఉన్నాడని చెప్పారు. నేను పెద్దగా పట్టించుకోలేదు. సిక్ లీవులో ఉంటే అటెండెన్స్ రిజిస్టర్‌లో మాత్రం సిక్ అని రాయలేదు. అంతకు మించి నాకేమీ తెలియదు. – తుకారాం రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు మండలంలోని దేవునిపల్లి, లింగాపూర్, అడ్లూర్, చిన్నమల్లారెడ్డి, గర్గుల్ తదితర గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కురిసిన అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. అరగంట పాటు కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వరిధాన్యం కొట్టుకుపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. కొనుగోలు కేంద్రాలకు వడ్లను తీసు కొచ్చి 15 రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



కామారెడ్డి గాంధీ గంజ్‌లో వర్షం నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

సమస్యల పరిష్కారానికే మీడియేషన్ సెంటర్లు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భరతలక్ష్మి

ఖలీల్‌వాడి/నిజామాబాద్‌నాగారం: సమస్యల పరిష్కార మార్గమే సామూహిక మధ్యవర్తిత్వ కేంద్రం ప్రధాన ఉద్దేశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మి అన్నారు. నగరంలోని దుబ్బ రోడ్డులో ఉన్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో, మారుతినగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియేషన్ సెంటర్లను న్యాయమూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కొంత మంది తటస్థ వ్యక్తులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చి కేంద్రం నిర్వహణ బాధ్యతలను అప్పగించడం జరుగుతుందన్నారు. ఒక్కో సెంటర్‌లో ఐదుగురు చొప్పున కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు ఉంటారని తెలిపారు. మీడియేషన్ సెంటర్ల ద్వారా సామరస్య పూర్వకంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి ఉదయ్‌భాస్కర్‌రావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ రాజేందర్‌రెడ్డి, స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ శైలజ, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

- ఇంటర్ పరీక్షలు రాయనున్న 18,837 మంది విద్యార్థులు
- ఈనెల 22 నుంచి ప్రారంభం
- జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్



మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి రవికుమార్

నిజామాబాద్ అర్బన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో నిర్వహించిన సోమవారం చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పరీక్షాకేంద్రంలో సీసీ కెమెరాలతో పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండో సంవత్సరం పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. సెంటర్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత తమ ఆధీనంలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాలల్లో హాల్ టికెట్లు తీసుకోలేని వారు ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావొచ్చని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం, స్టాంప్ లేకపోయినా విద్యార్థులను అనుమతించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, కనకమహాలక్ష్మి, ఖిల్లా బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ఖాళిక్ పరీక్షల నిర్వహణ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను వివరించారు. సమావేశంలో 36 పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

36 సెంటర్లు..

ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 18,837 మంది వి ద్యార్థులు హాజరుకానున్నారని, ఇందుకోసం మొ త్తం 36 సెంటర్లను ఏర్పాటు చేశామని జిల్లా ఇంట ర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ తెలిపా రు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 10,095, ఒకేషనల్ విద్యార్థులు 1,420 మొత్తం 11,515 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించా రు. అలాగే రెండో సంవత్సరం జనరల్ 6,456, ఒకేషనల్ 866 మంది మొత్తం 7,322 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు..

పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా తాను వ్యవహరించనుండగా, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్‌లు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ఇద్దరు విధులు నిర్వర్తిస్తారని రవికుమార్ వివరించారు. జిల్లా పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతోపాటు పోస్టాఫీస్, విద్యు త్, వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ అధికారుల సమన్వయంతో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో అడ్మిషన్లు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తొర్లికొండ విద్యార్థులు



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బానోత్ రాజు, నాగసూర విగ్నేశ్, సిద్ధార్థ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. వీరు ఈ నెల 21 వరకు మెదక్‌లో జరిగే 11వ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కనక రవి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఉత్కం శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, భూమేశ్, వినోద్, సాయిరెడ్డి, గంగారెడ్డి అభినందించారు.

జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానీపేట గ్రామ శివారులోని పంట చేనులో బండరాళ్ల కోసం అమర్చిన జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భవానీపేట గ్రామానికి చెందిన దర్శనం సిద్దిరాములు పంట చేనులో ఉన్న బండరాళ్లను తొలగించేందుకు జిలెటిన్ స్టిక్స్ అమర్చినట్లు సమాచారం అందడంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సీఐ రవీందర్, ఎస్సైలు వెంకట్రావు, రాఘవేంద్ర గ్రామానికి చేరుకొని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయగా 31 జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సిద్దిరాములు భూమిని బాగు చేసుకునేందుకు జిలెటిన్ స్టిక్స్ అమర్చినట్లు తెలిపారు. కాగా, ఆదివారం జిలెటిన్ స్టిక్స్ పేల్చడంతో సబ్ స్టేషన్‌కు ప్రమాదం తప్పిందన్నారు. పలు ఇళ్లు, వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు జిలెటిన్ స్టిక్స్ అమర్చిన వ్యక్తిని, పంట చేను యజమానిని అదుపులోకి తీసుకున్నారు.

పీవోకే సాధించుకోవడమే లక్ష్యం

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ఇందూరులో భారీ తిరంగా ర్యాలీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను సాధించుకోవడమే ఏకైక లక్ష్యమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించే వరకూ కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల ఘన విజయం, త్రివిధ దళాల ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ కన్వీనర్ జీవీ కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సా యంత్రం నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్ సిందూరు ద్వారా భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. ఇందూరులోనూ దేశద్రోహులు ఉన్నా రని, పాకిస్తాన్ వెళ్లిపోవాలని ప్రధాని మోదీ చెప్పినా కొందరు దాక్కున్నారని తెలిపారు. భారతీయులందరం భారత సైన్యం వెంట ఉన్నామనడానికి ఈ ర్యాలీ నిదర్శనమని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. ప్రధాని మోదీతోనే దేశం సురక్షితంగా ఉంటుందని, ఆయనే దేశానికి రక్షకు డని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి పేర్కొన్నారు. మనమంతా ఒక్కటేనని, ఇలాంటి విపత్కర సమయంలో ఏకతాటిపై నిలబడాలని, ఐక్యత చాటేలా ఇందూరులో తిరంగా ర్యాలీ విజయవంతంగా కొనసాగిందని సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ కన్వీనర్ జీవీ కృపాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, ప్రముఖులు డాక్టర్ వెంకటరమణ, పంచరెడ్డి ఎర్రన్న, రామర్తి గంగాధర్, రవిరాజ్, కొండా దశరథం, పవన్ ఖేడియా, సుబ్బారావు, కమల్ కిశోర్ ఇనాని, బీజేపీ నాయకులు న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి నెహ్రూపార్క్ వద్ద ర్యాలీని పర్యవేక్షించారు.

ప్రజావాణికి 104 ఫిర్యాదులు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్

నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 104 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఇరిగేషన్ స్థలాన్ని కాపాడాలి..

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో కబ్జాకు గురవుతున్న ఇరిగేషన్ స్థలాన్ని కాపాడాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్గుల్ సురేశ్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విలువైన నిజాంసాగర్ కాలువ స్థలాన్ని కొందరు తప్పుడు సర్వే నంబర్లతో కబ్జా చేశారని పేర్కొన్నారు. స్థలాన్ని ప్లాట్లుగా చేసి ఇతరులకు విక్రయిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

కోర్టులో ఉద్యోగం పేరిట నకిలీ అపాయింట్‌మెంట్

- సీపీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు


వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు పీరు

ఖలీల్‌వాడి: కోర్టులో ఉద్యోగం కల్పిస్తామని మాయ మాటలు చెప్పి రూ. 9 లక్షలు తీసుకొని నకిలీ అపాయింట్‌మెంట్ ఇచ్చిన వ్యక్తిపై నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామ పరిధిలోని లింగి తండాకు చెందిన తేజావత్ పీరు సోమవారం సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సిరికొండ మండలంలోని చీమన్‌పల్లి గ్రామానికి చెందిన మాలవత్ మోహన్ ఓ శుభకార్యంలో కలిసి పోస్టాఫీసు, కోర్టు ఉద్యోగాలు ఇప్పిస్తానని, చాలా మందికి ఉద్యోగాలు ఇప్పించినట్లు తెలిపారు. డబ్బులు చెల్లిస్తే ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికినట్లు చెప్పారు. దీంతో పీరు తమ తల్లిదండ్రులు వద్ద నుంచి రూ.4 లక్షలు డబ్బులు తీసుకొని పోస్టాఫీసులో ఉద్యోగం ఇప్పించాలని కోరడంతో కొన్ని రోజుల తర్వాత నకిలీ అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. విషయం తెలిసి మోహన్‌ను నిలదీయగా ఎవరికీ చెప్పొద్దని, కోర్టులో మార్చి నెలలో ఉద్యోగం ఇప్పిస్తానని మిగితా డబ్బులు చెల్లించాలని చెప్పడంతో అప్పు చేసి మరో రూ. 5 లక్షల వరకు చెల్లించినట్లు పేర్కొంది. మాలవత్ మోహన్‌తోపాటు అతని భార్య లావణ్య, కుతూరు శ్రావణి, కుమారుడు శ్రావణ్‌తో పాటు మాలవత్ రాజుకు విడతల వారీగా రూ.9 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. కోర్టు ఉద్యోగం వచ్చిందని మాలవత్ రాజు జిల్లా కోర్టులోని రెండో ఫ్లోర్‌లోకి వెళ్లి అక్కడ నిలుచోబెట్టి ఒక రిజిస్టార్ తీసుకువచ్చి సంతకం చేయించుకున్నట్లు చెప్పింది. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దనడంతో అనుమానం వచ్చి అపాయిమెంట్ ఆర్డర్ చూపించడంతో నకిలీదిగా తేలిందన్నారు. ఇదే విషయాన్ని మోహన్‌ను అడిగితే దుర్భషలాడుతున్నట్లు చెప్పారు. నకిలీ అపాయిమెంట్ ఇచ్చిన మోహన్ తోపాటు వారి కుటుంబసభ్యులపై చర్యలు తీసుకువాలని సీపీని కోరినట్లు బాధితురాలు తెలిపారు.

పచ్చిరొట్ట.. పంట దిట్ట


జీలుగ

- భూసారం పెరుగుదలకు దోహదం
- రాయితీపై అందజేస్తున్న సర్కారు

బాల్కొండ: అధికంగా దిగుబడులు సాధించాలన్న ఆతృతతో నేటి రైతాంగం విపరీతమైన రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతిని పంటలు తీవ్రమైన పోషకాల లోపాలతో పాటు చీడపీడల ఉధృతికి గురవుతాయి. వీటన్నింటికీ పచ్చిరొట్ట ఎరువుల వాడకమే విరుగుడని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తోంది. పచ్చిరొట్ట సాగు, వాటి ఉపయోగాలపై బాల్కొండ వ్యవసాయ అధికారి బద్దం లావణ్య వివరించారు.

జనుము

జనుము ఎకరానికి 10- 15 టన్నుల పచ్చిరొట్టనిస్తుంది. జనుమును పూత దశలో దుక్కిలో కలియదున్నాలి. ఒక టన్ను జనుము పచ్చిరొట్టలో 4 కిలోల నత్రజని ఉంటుంది. వరి పొలాలకు, ముంపు నేలలకు ఉపయోగపడుతుంది.

జీలుగ

జీలుగ ఎకరానికి 8-10 టన్నుల పచ్చిరొట్టనిస్తుంది. విత్తిన 70-80 రోజుల వ్యవధిలో కలియదున్నాలి. ఒక టన్ను జీలుగ పచ్చిరొట్టలో 5 కిలోల నత్రజని ఉంటుంది. చౌడు నేలలకు ఉపయోగపడుతుంది.

పిల్లిపెసర

పిల్లి పెసర ఎకరానికి 4-5 టన్నుల పచ్చిరొట్టనిస్తుంది. పూతదశలో కలియదున్నాలి. అన్ని నేలలకు ఉపయోగపడుతుంది. పశుగ్రాసంగా కూడా ఉపయోగించుకోవచ్చు.

ఉలవ

ఉలవ పచ్చిరొట్ట ఎకరానికి 4-5 టన్నుల దిగుబడి వస్తుంది. పూతదశలో కలియదున్నాలి. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. అన్ని నేలకు శ్రేయస్కరం.

అలసంద

అలసంద పచ్చిరొట్ట ఎకరానికి 4-6 టన్నుల దిగుబడి వస్తుంది. పూతదశలో కలియదున్నాలి. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. తేలిక నేలల్లో అనుకూలంగా ఉంటుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో 3.5 కిలోల నత్రజని ఉంటుంది.

విత్తేకాలం

ఖరీఫ్ పంటలకు ముందు మే, జూన్‌లో తొలకరి వర్షాలు కురిసిన వెంటనే నేలను దున్ని ఎకరానికి 12-15 కిలోల విత్తనం చల్లాలి. జనుము ఎకరానికి 20 కిలోల విత్తనం సరిపోతుంది. దీర్ఘకాలిక పంటలు అయిన పండ్ల తోటల మధ్య పచ్చిరొట్టలు వేసి పెరిగిన తర్వాత దుక్కిలో దున్నవచ్చు.

ఉపయోగాలు ఇవే..

పచ్చిరొట్టల్లో సేంద్రియ పదార్థముంటుంది. సూక్ష్మజీవులు విస్తరంగా వృద్ధి చెంది భూసారం పెరుగుతుంది. భూమిని గుల్లబరిచి నీటి నిలువ, ఇసుక బాగుపడి సులభంగా నీరు, గాలి వేర్లకు అందుతుంది. ఈ జాతి పైర్ల వేర్లు భూలోపలికి వెళ్లి గట్టి పొరలను చీల్చుతాయి. పచ్చిరొట్ట పైర్ల సాగుతో సూక్ష్మపోషక పదార్థాల లోపాలు రాకుండా ఉంటాయి. పచ్చిరొట్ట పైర్లు భూమిలో కుళ్లేటప్పుడు రసాయనిక ప్రక్రియలు జరిగి మొక్కలకు పోషక పదార్థాలు అందుతాయి.

సేంద్రియ ఎరువులను వినియోగించాలి


అవగాహన కల్పిస్తున్న రుద్రూర్ కేవీకే శాస్త్రవేత్త

రెంజల్(బోధన్): నేల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు స్వప్న, రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు తక్కువ యూరియా వినియోగించుకొని, సాగు ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. ప్రైవేట్ రకాలకు దీటుగా వానాకాలానికి అనువైన వరి వంగడాలు కూనారం 1638, వరంగల్ సిద్ధి, డబ్ల్యూజీఎల్ 1119, ఆర్‌డీఆర్ 1200, ఆర్‌డీఆర్ 1162, ఆర్ఎన్ఆర్ 15048 వంటి రకాలు రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావ్, పశువైద్యాధికారి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోపాల్: మండలంలోని మంచిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. 17 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు.. ఆత్మీయంగా పలకరించుకొని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని ఘనంగా సన్మానించారు.

ముగిసిన వాలీబాల్ శిక్షణ శిబిరం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 20 రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ డీటీవో ఉమా మహేశ్వర్ రావు, ఆదిలాబాద్ రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారుల అవసరాల కోసం రూ.20 వేల నగదును అందజేశారు. విద్యార్థులకు శిక్షణనిస్తున్న పీఈటీ మధును అభినందించారు. కార్యక్రమంలో ఆర్మూర్, కామారెడ్డి, బోధన్ ఎంవీఐలు వివేకానంద రెడ్డి, శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత టీచర్లకు శిక్షణ



మోపాల్: నగర శివారులోని బోర్గాం(పీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ఉపాధ్యాయులకు రెండో విడత శిక్షణా కార్యక్రమం ప్రారంభమవుతుందని డీఈవో అశోక్ తెలిపారు. సోమవారం రెండో విడత టీచర్ల శిక్షణకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని బోర్గాం(పీ) జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రెండో విడత టీచర్ల సమావేశం ఐదురోజులపాటు కొనసాగుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు సెంటర్ ఇన్‌చార్జీలు చేసుకోవాలని సూచించారు. రీసోర్స్ పర్సన్లు సెషన్ వారీగా అంశాలపై తగిన టీఎల్ఎం తయారు చేసుకొని ప్రిపేర్‌కావాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రైనింగ్‌కు ముందు, కొనసాగే సమయం, ట్రైనింగ్ తర్వాత విషయాలను వివరించారు. ఆర్‌పీలు శిక్షణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శంకర్, ఏఎంవో, సెంటర్ ఇన్‌చార్జీలు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని గాజుల్‌పేట్ గురుద్వారా సమీపంలో స్పృహ తప్పిన గుర్తు తెలియని మహిళ (60 నుంచి 65) ఆస్పత్రిలో మృతి చెందినట్లు రెండో టౌన్ ఎస్సై తెలిపారు. ఈ నెల 10న మహిళ స్పృహ తప్పి ఉండగా స్థానికులు జీజీహెచ్‌కు 108 అంబులెన్స్‌లో తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందిందని, మృతురాలి వివరాలు తెలిస్తే 87126 59838 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి మెయిన్ గేట్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి (30 నుంచి 35) మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మృతుడు తెలుపు కలర్, బనియన్ ఆకుపచ్చ రంగు, ప్యాంట్ ధరించినట్లు చెప్పారు. మృతుడి సమాచారం ఎవరికైనా తెలిస్తే వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ధర్మమార్గంలో నడవాలి


మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, పక్కన జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రజలంతా ధర్మమార్గంలో నడవాలని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రధానంగా యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. సోమవారం డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ ప్రతిష్ఠాపన ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తనది నిర్మల్ జిల్లా అయినప్పటికీ డొంకేశ్వర్ మండల చుట్టు పక్కల గ్రామాల్లో బంధువులు ఉన్నారని, నికాల్‌పూర్‌లో కూడా ఉన్నట్లు తెలిపారు. అనంతరం జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి కృషి చేసిన కమిటీ, వీడీసీ సభ్యులు, గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. చివరి రోజు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అభిషేకం, కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి రెడ్డి, రావుల సుభాష్, భీమ్ నాయక్, సుమన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తండ్రి దాడిలో కొడుకు మృతి



కామారెడ్డి క్రైం: తండ్రీకొడుకుల మధ్య గొడవ ఒకరి హత్యకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వడ్ల నిఖిల్ (24) కొన్ని నెలల క్రితం గల్ఫ్ వెళ్లి మూడు నెలల క్రితం తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి నిఖిల్ మద్యం, కల్లు లాంటి దురలవాట్లకు బానిసయ్యాడు. డబ్బుల కోసం నిత్యం తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి తండ్రి భాస్కర్‌తో గొడవ జరిగింది. భాస్కర్ ఆవేశంతో అక్కడే ఉన్న ఓ ఇనుప రాడ్డుతో నిఖిల్‌పై దాడి చేశాడు. నిఖిల్ తలకు బలమైన గాయం కావడంతో వెంటనే కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిఖిల్ సోమవారం మృతి చెందాడు. భాస్కర్‌పై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ సీజ్

ఇందల్వాయి: మండలంలోని కొటాల్‌పల్లి బీట్ పరిధిలోని 593 కంపార్ట్‌మెంట్‌లో అక్రమంగా లేకుండా అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్‌వో రవి మోహన్ భట్ తెలిపారు. సెక్షన్ అధికారి భాస్కర్, బీట్ ఆఫీసర్లు ప్రవీణ్, దిలీప్, పోచయ్య, బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

సిరికొండలో రెండు ట్రాక్టర్లు..

సిరికొండ: మండలంలోని రావుట్ల బీట్ పరిధిలోని జంగిలోడి తండా, చింతల్ తండా అటవీ ప్రాంతంలో అటవీ భూమిని అక్రమంగా దున్నిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం సోమవారం తెలిపారు. ట్రాక్టర్లు జంగిలోడి తండాకు చెందిన గుగ్లోత్ గంగాధర్, బనావత్ మదన్‌లవని ఆయన పేర్కొన్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు.

ఐదుగురికి జైలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో నిబంధనలు అతిక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్న నలుగురితోపాటు మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఓ వ్యక్తికి బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి జైలు శిక్షను విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణ పరిధిలోని దాబా, హోటల్, దుకాణాల యజమానులు నలుగురికి రెండు రోజుల జైలు, తాగి వాహనం నడిపిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షను విధించారని పేర్కొన్నారు.

మనస్పర్ధలతో భార్యను కడతేర్చిన భర్త

- పిల్లల ఎదుటే దారుణం


అంజలి (ఫైల్)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

ఆర్మూర్‌టౌన్: కట్టుకున్న భార్యను కన్నపిల్లల ఎదుటే గొంతుకోసి హతమార్చిన ఘటన ఆర్మూర్ పట్టణంలో సోమవారం కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ అలియాస్ గంగారెడ్డికి జగిత్యాల జిల్లా మొగిల్‌పేట్ గ్రామానికి చెందిన అంజలి(35)తో 16ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గంగారెడ్డి జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్తూ వస్తుండేవాడు. గంగారెడ్డి-అంజలి మధ్య మనస్పర్ధలు రావడంతో విడాకుల కోసం బోధన్ కోర్టును ఆశ్రయించగా ప్రస్తుతం కేసు నడుస్తోంది. గొడవల కారణంగా అంజలి తన ఇద్దరి కూతుళ్లతో కలిసి 20 రోజుల క్రితం ఆర్మూర్ పట్టణంలో నివాసముంటుంది. కేసు నిమిత్తం అంజలి కూతుళ్లతో కలిసి సోమవారం బోధన్ కోర్టుకు హాజరై తిరిగి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటోంది. భర్త గంగారెడ్డి ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడి ఆమెపై కత్తితో దాడి చేశాడు. అడ్డుకున్న పిల్లలను తోసేసి అంజలి గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. పిల్లల అరుపులు విన్న ఇంటి యజమాని విషయం తెలుసుకునేందుకు రాగా అతనిని సైతం తోసేసాడు. దీంతో గంగారెడ్డి బయటికి వెళ్లకుండా యజమాని ఇంటి గేటు మూసేసి గడియపెట్టి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అంజలి అప్పటికే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని సీపీ సాయి చైతన్య, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..

తన వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తుందనే అంజలిని భర్త గంగారెడ్డి అడ్డు తొలగించుకున్నట్లు సమాచారం. దుబాయిలో ఉంటున్న గంగారెడ్డి.. ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళతో కొన్నేళ్లుగా వివాహేతర బంధం కొనసాగిస్తున్నాడని భార్యకు తెలవడంతోనే గొడవలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. గొడవలు ముదిరి విడాకుల వరకు వెళ్లగా, కోర్టులో కేసు నడుస్తుండగానే అంజలిని గంగారెడ్డి హతమార్చాడు. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


రాకేశ్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని చిన్న ఆరేపల్లి గ్రామానికి చెందిన కొంకుల రాకేశ్(20) అనే డిగ్రీ విద్యార్థి సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న ఆరేపల్లి గ్రామానికి చెందిన కొంకుల పోచవ్వ, గంగారాం దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన రాకేశ్ ఎల్లారెడ్డి పట్టణంలో ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఉపాధి కోసం తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వలస వెళ్లారు. తమ్ముడు మధుతో కలిసి చదువుకుంటూ ఇంటి వద్ద ఉంటున్న రాకేశ్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడ్డాడు. ఆన్‌లైన్ గేమ్ ఆడటం ద్వారా రూ. 80 వేలు పొగొట్టుకున్నాడు. ఈ విషయం తండ్రికి తెలిసి మందలించాడు. అంతే కాకుండా రాకేశ్ తరచూ ఫోన్ మాట్లాడుతున్నాడని తండ్రి మరోమారు మందలించడంతో తీవ్ర మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శివకుమార్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇళ్లలో చోరీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కల్కినగర్ కాలనీలో తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన నీళ్ల సాయినాథ్ ఈ నెల 18న ఇంటికి తాళం వేసి తన కుటుంబంతో తీర్థయాత్రలకు వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. వెంటనే దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీరువాలో దాచి ఉంచిన రెండు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు అపహరణకు గురైంది. అదే భవనం పైఅంతస్తులో నివాసం ఉండే పెంటయ్య ఇంట్లో కూడా ఇదే తరహాలో చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.